


# టీ కప్పు

మోహనకృష్ణ

నా ఉద్దేశం అది కాదు. మనం ఎటు వెడుతున్నాం అన్నది కాదు నా ప్రశ్న. మనం ఎట్లా వెడుతున్నాం అనేది. సాహిత్యం, సాహిత్య విమర్శ మన చుట్టూ ఉన్న సమాజంలోని ఇష్యూలను, సమస్యలను ప్రతిఫలించగలిగితే చాలా? లేక ఇంకా ఏవన్నా జరగాలా? మన సాహిత్యం ద్వారా సాహిత్య విమర్శ ద్వారా క్రియాత్మకంగా మనం ఏం చేయగలుగుతున్నాం

విష్ణుకి చెయ్యి లాగేస్తోంది. పొద్దున్నించీ, ఎందుకో మరి. మొదలు దగ్గర్నించీ వేళ్లలోకి సన్నసన్నగా, రాజుకుంటున్న నిప్పులా బాధ. కుడిచెయ్యి అందుకే పొద్దున్నించీ ఎక్కువ వాడట్లేదు. ఎడం చేత్తోనే సర్వింగు, ఓ కప్పు బద్దలు కొట్టేడు కూడా. గల్లాపెట్టె దగ్గర అరచేత్తో చిల్లర గలగల్లాడిస్తున్న ప్రొప్రయిటర్, ఓసారి ఆగి, గుప్పెట్లో చిల్లర బిగించి, విష్ణు మొహం వైపు, పగిలిన పెంకుల వైపూ చూశాడు. ''నీయమ్మ, లంజొడకా... చూస్కోబే. బలిసిందా ఏంటి?'' అనేసి, చిల్లర గల్లాపెట్టెలోని స్టీలు గిన్నెలోకి విసురుగా పోసి, రోజూ వచ్చే ఫ్రెండుతో బూతు సంభాషణ కొనసాగించాడు. 'సాయంత్రం మనకి ఉందిలే' అనుకున్నాడు విష్ణు నిర్లిప్తంగా. చెయ్యి నెమ్మదిగా విదిలించాడు, 'ఖరేల్'మంది. 'అబ్బా' అని మోచేయి పట్టుకున్నాడు. ప్రొప్రయిటర్ మళ్ళీ చూశాడు. ''చెయ్యి'' అన్నాడు విష్ణు గుటకవేసి. ప్రొప్రయిటర్ అర్థం కానట్టు చూసి తిరిగి ఎవరో సినిమా హీరోయిన్ తొడల్లోకి వెళ్ళిపోయాడు. పోలోమని కుర్రాళ్ళు కొంతమంది, కొంతమంది అమ్మాయిలూ కాంటీన్‌లోకి వచ్చారు గ్రీన్ సిగ్నల్‌పడ్డ తర్వాత పరిగెత్తే మోటారుబళ్ళలాగా. మళ్ళీ మొదలు....

''విష్ణూ... దోచాయ్''

''విష్ణూ... తీన్ చా... నయ్‌నయ్... పాంచ్''

''జల్దీ ఓటియ్యమ్మా!''

ఎడంచెయ్యికి అలుపే లేదు. కాసేపటికి అది మసగ్గా, ఓ గీతలా కనపడ్డం మొదలెట్టింది.

★★★

కుర్రాళ్ళు గుంపెళ్ళాక స్టూలు మీద కాసేపు కూర్చుని, పగిలి, బూజు పట్టి, మట్టి అతుక్కుని, దుమ్ము కొట్టుకుపోయిన అద్దాల కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు. కాంటీన్‌లో ఎక్కువగా జనం లేరు. ప్రొప్రయిటర్ కూడా పొంటు జేప కింద నలుపుకుంటూ స్నేహితుడితో బైటకెళ్ళిపోయాడు. ప్రొప్రయిటర్ కుడిభుజం రాజారాం రాజ్యం మొదలైంది.

''ఏంది బేయ్... కిటికీలోంచి చూస్తున్నావ్... ఏం కనబడ్తోంది? అమ్మాయేవన్నా ఉచ్చబోస్కుంటుందా... హహహ.... నీయ్యవ్వ... లోపల స్పూన్లు, కటోరీలు కడుగు'' అన్నాడు ఇంకా నవ్వుతూ. రాజారాంకి నోరుకి రెండు వైపులా కోరల్లాగా బొర్లి చారలుంటాయి. తెల్లలుంగీ మీద ఖద్దరు చొక్కా, గుండీలు ఏడిట్లో నాలుగు తీసేసుంటాయి. గుండెల మీద దట్టమైన వెంట్రుకల్లో చిక్కుకున్న చైను ''ఏందా చూపు? లెగూ'' అరిచాడు రాజారాం. విష్ణు లోపలికి పరుగెత్తాడు. దాటుతుంటే దభీమని వీపుమీదొక గుద్దుపడింది. పళ్ళకిందే ఓ వంద బూతులు తిట్టుకున్నాడు విష్ణు. చల్లటి నీళ్ళలో చెయ్యి పెట్టబుద్ధవ్వలేదు. ఎవరెవరో నాకి, తినీ తినక వదిలేసినవి కడగాలి. పంపు తిప్పాడు. చివ్వుమని చల్లగా నీళ్ళు. అరచెయ్యి, వేళ్ళు కాసేపటికి బండబారిపోయాయి.

★★★

పదకొండింటికి ఓ కుర్రాడు బైక్ మీదొచ్చి, బండి స్టాండువేసి లోపలికి పరుగెత్తుకొచ్చాడు. తలమీద టోపీ వెనక్కి తిప్పి పెట్టుకుని గమ్మత్తుగా ఉన్నాడు.

''రాజారాం''

''హల్లో... ఏంటిసార్... రెడీ!''

''అక్కడ వాళ్ళు టీ బ్రేక్ ఇవ్వట్లేదు. మీటింగులోనే సర్వ్ చెయ్యాలి. విష్ణు ఉన్నాడా?''

''రేయ్''

''పంపెయ్ వాణ్ణి. బైక్ మీద తీస్కెళ్తా''

''రేయ్ విష్ణూ. ఆ చాయ్ డబ్బా తీస్కో. అయ్యి విజయ్‌గాణ్ణి కడగమను. ఆ డబ్బా తీస్కెళ్ళి ఆ మీటింగ్‌లో సర్వ్ చెయ్యాలి. పో... జల్దీ''

విష్ణు గబగబా చేతులు కడుక్కున్నాడు. నిండా పోసి పెట్టిన థెర్మల్ ఫ్లాస్కు పొరపాట్న కుడిచేత్తో ఎత్తేశాడు. 'కరేల్ కరేల్ కరేల్'మనేసింది. విలవిల్లాడిపోయి, దబ్‌మని కిందపెట్టేడు.

''ఏందిరోవ్ బద్దలైపోద్ది. నొప్పిగుంటే ఎడం చేత్తో పట్టుకో నీయవ్వ. నాకినాకి తింటావు కదుబే'' కసిరాడు రాజారాం. ఆ కుర్రాడు జాలి పడ్డాడు. ''ఒదిలెయ్ రాజారాం. విష్ణూ రా పోదాం'' బైక్ దగ్గరికి పరిగెత్తాడు. ఎడంచేత్తో ఫ్లాస్కూ, కుడిచేత్తో గుండెలకి దగ్గరగా గుడ్డ సంచీలో కప్పులూ. బరువుని తట్టుకోడానికి కాస్త ఊగుతూ నడుస్తుంటే కప్పులు కణకణమన్నాయి. జాగ్రత్తగా పట్టుకుని, బైక్ దగ్గరికి పరిగెత్తాడు. కుర్రాడు స్టార్ట్ చేసి కూర్చున్నాడు. ఫ్లాస్కు ఇద్దరి మధ్యలో పట్టలేదు. ''పక్కకి పట్టుకో. కప్పుల్ని మధ్యలో పెట్టు'' అన్నాడు కుర్రాడు. ఫ్లాస్కుని ఎడంచేతికి వేళాడదీశాడు. యాభైమంది తాగాల్సిన టీ, వేడిగా తొడకి తగుల్తోంది. పిర్రలు సీటు వేడికి చుర్రుమన్నాయి. బైక్ కొత్తది కాబోలు, ఝామ్మని దూకింది. విష్ణు కొద్దిగా తూలాడు. లోపల టీ గళగళమంది. కప్పులు మళ్ళీ కణకణమన్నాయి. ''జాగ్రత్త'' అన్నాడు కుర్రాడు. చల్లగాలి ఒక్కసారి విష్ణు మొహాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. గుండెల నిండా పీల్చుకున్నాడు. కుర్రాడి తలమించి ఖరీదైన నూనె వాసనొస్తోంది. తలపైకెత్తి చూస్తే చెట్ల తలలు వెనక్కి పరిగెడుతున్నాయి. ముందుకి చూస్తే ఆకాశం, కాళ్ళ కింద చాప లాగేస్తే, వెనక్కి పడిపోతున్నట్టుగా ఉంది. అతనికి ఒక్కసారిగా హాయిగా అనిపించింది. కళ్ళలో నీళ్ళు నిండాయి. అరచేతిలో చెమటకి ఫ్లాస్కు కొక్కెం జారకుండా పట్టు బిగించాడు. కప్పులు గుండెలకి అదిమాడు. కుర్రాడు చాకచక్యంగా నడుపుకుంటూ వెళ్ళి, మీటింగ్ జరిగే ఆడిటోరియం ముందు ఆపాడు. యూనివర్సిటీలోకెల్లా ప్రతిష్ఠాత్మకమైన ఆడిటోరియం అది. దేశ, విదేశాల నించి వచ్చే మేధావులు, రచయితలు తరచూ సమావేశమయ్యే వేదిక. విష్ణు ఫాస్కూ, కప్పులతో దిగాడు. కుర్రాడు కూడా దిగి, స్టాండువేసి పరుగెత్తాడు. వెనకాలే విష్ణు. తలకాయ వంచి పరుగుస్తూ. వాడి కళ్ళకి తారురోడ్డు కాళ్ళకింద జరజర పాకుతున్న పాములా కనిపించింది. ఆడిటోరియం కారిడార్‌లోకి అడుగుపెట్టారు. కుర్రాడు విష్ణుకి ఏం చెయ్యాలో చెప్పాడు. విష్ణు ఎప్పుడూ ఇలా సర్వింగుకి రాలేదు. విజయ్‌గాడు వెళ్ళేవాడు. ఫ్లాస్కు మూల ఉన్న స్టూలు మీద పెట్టి, కప్పుల సంచీ పక్కన పెట్టి, కప్పులన్నీ బయటికి తీశాడు విష్ణు. ''ష్...ష్... నెమ్మదిగా'' వారించాడు కుర్రాడు. ఓ క్షణం ఆగి, కుర్రాడి వైపు చూసి నవ్వి, కప్పులు నింపడం ప్రారంభించాడు విష్ణు.

★★★

లోపల చల్లగా ఉంది. మెత్తటి, మంద్రమైన మైకులో పిల్లిగడ్డంతో ఉన్న ఓ వ్యక్తి మాట్లాడుతున్నాడు.

''నో... నా ఉద్దేశం అది కాదు. మనం ఎటు వెడుతున్నాం అన్నది కాదు నా ప్రశ్న. మనం ఎట్లా వెడుతున్నాం అనేది. సాహిత్యం, సాహిత్య విమర్శ మన చుట్టూ ఉన్న సమాజంలోని ఇష్యూలను, సమస్యలను ప్రతిఫలించగలిగితే చాలా? లేక ఇంకా ఏవన్నా జరగాలా? మన సాహిత్యం ద్వారా సాహిత్య విమర్శ ద్వారా క్రియాత్మకంగా మనం ఏం చేయగలుగుతున్నాం'' స్ప్రింగ్‌డోర్ తెరుచుకుంది. ''టీ ఈజ్ హియర్'' ఎవరో ఉత్సాహంగా గొణిగారు. ''ఎక్స్‌క్యూజ్‌మి'' ఒక యువకుడు లేచాడు. నిగనిగలాడే నల్లటి జుట్టు వెనక్కి తోస్కుంటూ ''ఐ థింక్ ఉయ్ ఆల్ నీడ్ ఎ కప్ ఆఫ్ టీ'' అన్నాడు మర్యాదగా నవ్వుతూ.

''ష్యూర్... ష్యూర్... టీ తాగుతూ డిస్కస్ చేద్దాం'' అన్నాడు పిల్లిగడ్డం. విష్ణు ట్రేలో కప్పుల్తో ఆడిటోరియం మధ్యలో దిక్కులు చూస్తూ నిలబడిపోయాడు. పిల్లిగడ్డం అలవాటుగా ''యంగ్‌మాన్ ప్రొసీడ్'' అన్నాడు నవ్వుతూ. విష్ణుకి ఒక్కసారిగా తనెక్కడున్నానో అర్థం కాలేదు. చేతిలో కప్పులు, తన చేతులూ, నిలబెడుతున్న కాళ్ళూ ఏవీ తనవిలా అనిపించలేదు. ఒళ్ళంతా ఓ వెదురుగొట్టంలా అనిపించింది. కుడిచెయ్యి 'చక్'మంది. కప్పులు కొద్దిగా కదిలాయి.

''సమ్‌బడీ గైడ్ హిమ్'' అన్నాడు పిల్లిగడ్డం చిరునవ్వుతో. ఓ జీన్సు, టీ షర్ట్ కుర్రాడు లేచాడు. ''షల్ ఐ హెల్ప్'' అంటూ.

విష్ణుకి పూర్తిగా స్పృహ వచ్చింది. పక్కకి తిరిగి ఎదురుగా ఉన్న వరసలో కప్పులు అందించడం మొదలెట్టాడు.

''థాంక్యూ...''

''ఓ... టీ?... హౌ నైస్!''

''హౌక్యూట్! పేరేంటి బాబూ''

విష్ణు తడబడి సిగ్గుపడ్డాడు. ''విష్ణు'' చెప్పాడు.

''విష్ణు! గుడ్! ద ప్రొటెక్టర్ ఆఫ్ దిస్ యూనివర్స్''

''హ... హహ...''

ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు. తెల్లటి చేతులూ. ఎర్రటి చేతులూ. నల్లటి చేతులూ. ఉంగరాలూ, రంగుల వాచీలూ. రంగుల చొక్కాలూ, బొమ్మల చొక్కాలూ. లిప్‌స్టిక్కు, అత్తరు. ఆఫ్టర్ షేవూ. మాసిన గడ్డం. చింపిరి గడ్డం. ఫ్రెంచి గడ్డం. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు.

''వేడిగా లేదే''

''అయ్ హేట్ దిస్ స్టఫ్''

''వద్దమ్మా... దే యూజ్ డర్టీ క్లోత్స్ టు ఫిల్టర్ దిస్'7

''ఓ... గాడ్'7

రెండు వరసలైయాయి. మూడో వరస. పిల్లిగడ్డం మళ్ళీ మొదలెట్టాడు.

''సాహిత్యం, రాజకీయం ఒకటే. ప్రతి రచనా ఒక రాజకీయ ప్రకటన. ఎ పొలిటికల్ స్టేట్‌మెంట్. మనం సాహిత్యపు సువాసనల గురించి, సౌరభాల గురించి చాలాకాలం మాట్లాడాం. ఇక సాహిత్యమనే రాజకీయాల్ని గురించి చర్చించాల్సిన అవసరం ఉంది''

మూడో వరస అయిపోయింది. మళ్ళీ కప్పులు నింపుకు రావాలి.

''ఇప్పుడా టీ ఇచ్చే అబ్బాయిని చూడండి''

అందరూ తలలు తిప్పారు. విష్ణుకి అర్థం కాలేదు. ట్రే అలాగే పట్టుకుని నిలుచుండిపోయాడు.

''మనం అతని జీవితాన్ని ఇంప్రూవ్ చేయడానికి ఏ విధంగా తోడ్పడుతున్నాం''

అందరూ చూస్తున్నారు ఆసక్తిగా. కొందరు జాలిగా. కొందరు ఏ భావం లేకుండా. విష్ణుకి దగ్గరగా ఉన్నాయన అతని వీపు మీద చెయ్యి వేశాడు ఆప్యాయంగా.

''యస్. మనమేం చేస్తున్నాం అతనికి. నథింగ్. మన సాహిత్యం ఏం చేస్తోంది? మన సాహితీ విమర్శ ఏం చేస్తోంది? నథింగ్''

ఎవరో వారించారు.

''అయ్ డోంట్ అగ్రీ. సాహిత్యం సమాజాన్ని ఉద్ధరించేదే, ప్రతిఫలించేదే కావాలని రూల్ లేదు. ఒక కథ చదివినప్పుడు గానీ, ఓ కవిత చదివినప్పుగానీ హృదయం చలిస్తుంది. కళ్ళు చెమరుస్తాయి. మనసు కకావికలమై పోతుంది''

''మీ మనసు కకావికలమైతే సమాజానికేవిటి ఉపయోగం?''

''ఉపయోగం?! సాహిత్యం కన్స్యూమర్ ప్రొడక్ట్ కాదు డాక్టర్ వినోద్. అది మనసుని ఉత్తేజపరచి, మస్తిష్కాన్ని పదునెక్కించాలి''

''కడుపు ఓ పక్క మండుతుంటే మనసూ మండుతుంది''

''అంటే ఏవిటంటారు? మనం రచన మానేసి సాంఘిక సేవ చేద్దామంటారా? టీలు సప్లై చేయమంటారా?''

''నా ఉద్దేశం అది కాదు''

బైక్ కుర్రాడొచ్చాడు. విష్ణుని అప్పటికే చాలామంది చూడ్డం మానేసి ఆ చర్చలోకి వెళ్ళిపోయారు. చేతులూ, గొంతులూ లేస్తున్నాయి. విష్ణు గబగబా బయటకొచ్చాడు. మళ్ళీ కప్పులు నింపి, లోపలికి పరుగెత్తాడు. బయట వేడిగా లోపల చల్లగా. విష్ణుకి మాత్రం లోపల మండుతోంది. గుండె, కడుపూ 'ఆకలిగా ఉంది' అనుకున్నాడు. కాసేపట్లో టీ సంరంభం ముగిసింది. లోపలి వాళ్ళింకా కొట్టుకుంటున్నారు. బైక్ కుర్రాడొచ్చి చెప్పాడు. ''ఓ గంట తర్వాత మళ్ళీ రావాలి''

''దేనికి'' అన్నాడు విష్ణు.

''టీ'' అన్నాడు కుర్రాడు జేబులోంచి తాళాలు తీస్తూ.

''ఇప్పుడేగా అయ్యింది'' అన్నాడు వింతగా చూస్తూ.

బైక్ కుర్రాడు నవ్వాడు జాలిగా.

''అదంతేలే'' అన్నాడు.

★★★

తిరిగొచ్చేసరికి విజయ్‌గాడొక్కడే సర్వింగ్ చేస్తున్నాడు.

''ఏందిరా, చెయ్యేలాగుంది?'' అడిగాడు.

విష్ణుకి కళ్ళనీళ్ళు తిరిగాయి. ''లాగుతోంది'' అన్నాడు మోచేయి దగ్గర పట్టుకుని. నొప్పి పెరుగుతోంది. గుండె మండుతోంది.

''కప్పు బగలగొట్టావుగా. ఈ వారంలో ఇది నాలుగోది'' అన్నాడు విజయ్. విష్ణుకి రక్తం జివ్వుమందెందుకో.

''కటోరీలు రెండో రౌండ్ కడగాలి. కడిగిందర్వాత తిను'' అన్నాడు విజయ్. కప్పుల సంచీ, ఫ్లాస్కూ తీసుకుని పంపు దగ్గరకెళ్ళాడు విష్ణు. వంటింట్లో విజయ్ వంటవాడితో అంటున్నాడు. ''నాలుక్కప్పులిరక్కొట్టాడు. రాజారాం జీతమియ్యనంటన్నాడు ఈడికీ నెల'' పంపు ముందర పడేసిన కప్పుల్లో ఒకదాన్ని ఎత్తి పట్టుకుని చూశాడు విష్ణు, దగ్గరగా పట్టుకుని. పొట్టిగా, రకరకాల రంగుల డాగులతో అక్కడక్కడా బీటలతో, నిస్తేజంగా ఉందది. కొంచెం తిప్పి చూస్తే ఇందాకటి పిల్లిగడ్డం వాడి మొహంలా ఉంది. విష్ణు చిన్నగా నవ్వాడు. కప్పుని అలాగే పట్టుకుని ఒదిలేశాడు. భళక్‌మంది. 'ఐదోది' అనుకున్నాడు. కొద్దిసేపాగి నిర్లిప్తంగా, ''సాయంత్రం మనకెలాగూ ఉందిలే అనుకున్నాడు.

★